## నాచారంలో పోలీసుల "మీ సురక్ష" అవగాహన కార్యక్రమం



**దశ ఓయూ :** మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు, నాచారం పోలీస్ స్టేషన్ సీఐ ధనుంజయ గౌడ్ ఆధ్వర్యంలో మీ సురక్ష (MEE SURAKSHA) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల భద్రత, నివాస ప్రాంతాలలో నేరాల నియంత్రణ, గృహ సహాయకుల వివరాల ధృవీకరణే లక్ష్యంగా ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రారంభ దశలో భాగంగా నాచారం పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్ ఐ వెంకటయ్య, ఎస్ ఐ మెబెల్లి, ప్రభాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది కృష్ణ, మై ఫ్లవర్ ప్లాటినం, మై ఫ్లవర్ హైట్స్ అపార్ట్మెంట్ల వాసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై ఉక్కుపాదం

❖ ఎస్ఐ చలికంటి నరేష్



**దశ, హుజూర్‌నగర్:** గంజాయి అక్రమ రవాణా,క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్.ఐ చలికంటి నరేష్ తెలిపారు. శనివారం హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన హుజూర్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణకు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, వ్యాపార సముదాయాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్ కు వచ్చి నిర్భయంగా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ టూ గజ్వేల్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కౌడ నరేష్



**దశ, దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి గజ్వేల్ మండలానికి నడిచే ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడిగా కౌడ నరేష్ యాదవ్ నియామకం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ.. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు నన్ను అధ్యక్షుడిగా ఎన్నకున్నందుకు ముందుగా వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వం గుర్తించి తగు సాయం చేయాలని కోరుతున్నాను. అలాగే యూనియన్ లోని సభ్యులకు ఏదైన ఆపద వస్తే ముందుగా స్పందించి వారి కష్టాన్ని తొలగించేందుకు ఆటో డ్రైవర్లమంతా.. ఒక్కతాటిపై ఉంటామన్నారు. విధిగా అందరు డ్రైవింగ్ లైసన్సులు పొందాలి. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా.. తగు జాగ్రత్తలు పాటిస్తూ.. డ్రైవింగ్ చేయాలని కోరారు. ట్రాఫిక్ సూచనలు పాటిస్తూ.. ప్రయాణికులను గమ్యం చేర్చే బాధ్యత మన ఆటోడ్రైవర్లపైన ఉంది. అలాగే ఎట్టి పరిస్థితిలోనూ మద్యం తాగి ఆటోలు నడపకూడదన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : మోతే శోభన్ రెడ్డి



**దశ, ఓయూ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సాధనలో కీలక పాత్ర పోషించిన తొలి దశ, మలిదశ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు శ్రీ మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు, గౌరవ పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే చర్య అని ఆయన అభినందించారు. శనివారం తార్నాక డివిజన్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి వారి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను అధికారికంగా గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం ఉద్యమకారులకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది యువకులు ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు పోలీసు కేసులు, జైలు జీవితం, శారీరక-మానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

అలాంటి ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సేవల ప్రామాణికత నిర్ధారణ, సంక్షేమ చర్యల రూపకల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ ద్వారా జీఓ ఆర్టీ నం.679 జారీ చేసిన విషయం తెలిసిందే.

ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ-విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్‌తో పాటు మోతే శోభన్ రెడ్డి నియమితులయ్యారు. ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, అర్హులైన వారికి గౌరవం, సంక్షేమ సదుపాయాలు కల్పించే దిశగా కమిటీ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు మోతే శోభన్ రెడ్డి తెలిపారు.

## పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

❖ అదనపు ఎస్పీ రాజేష్ మీనా



**దశ పెబ్బేర్:** వనపర్తి జిల్లా నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ పశువుల అక్రమ రవాణా జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా సూచించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ కేంద్రంలో ప్రతి వారం నిర్వహించే పశువుల సంతను అదనపు ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జాతీయ రహదారి సమీపంలోని పోలీస్ తనిఖీ కేంద్రాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల రవాణా చేసే వ్యక్తుల వద్ద పశువైద్య అధికారుల అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజల సహకారంతోనే పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టగలమని, అనుమానాస్పద వాహనాలు కనిపించినా లేదా అక్రమ రవాణా సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఓయూ పరిపాలన భవనం ముట్టడి..

**దశ ఓయూ :** ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగులు ప్రత్యక్ష పోరాటానికి దిగారు. పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఓయూ పరిపాలన భవనం సెనేట్ హాల్ లో ముట్టడించారు. హాల్ లో బైఠాయించిన ఉద్యోగులు వీసి, రిజిస్ట్రారు కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రశ్నిస్తున్న యూనియన్ల లీడర్లను బదిలీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీ చేసిన ఉద్యోగులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై గతంలో పలుమార్లు విసి కి రిజిస్ట్రారు కి వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించనీ పక్షంలో తమ ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. యూనివర్సిటీ వీసి, రిజిస్టార్లు ఉద్యోగులకి వ్యతిరేకంగా విధానాలను అమలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఎన్జీవో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకటేష్. గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్న వేతనాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన టైం స్కేల్ ఉద్యోగులకు వారి కి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కుమార్, ఎన్జీఓస్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ ఖాన్, జనరల్ సెక్రెటరీ బి వెంకటేష్, టెక్నికల్ స్టాఫ్ సోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రెటరీ అక్బర్ బెగ్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజ రావు, జనరల్ సెక్రెటరీ మొయిజోద్దీన్, ఉద్యోగ సంఘాల నాయకులు ఉపేందర్ యూసఫ్, రామాంజనేయులు. ఖలీల్, మల్లేష్ ఓ ఎస్. నర్సింగ్ రావు ఉద్యోగులు పాల్గొన్నారు.




## పెరిగిన ధరలపై సిపిఐ నిరసన ప్రదర్శన

❖ పెద్ద అంబర్‌పేట్‌లో భారీ ర్యాలీ

**దశ, పెద్ద అంబర్‌పేట్:** దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ మరియు నిత్యవసర వస్తువుల ధరలకు నిరసనగా శనివారం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 52వ డివిజన్‌లో సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన మరియు ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఇంధన ధరలను పెంచుకుంటూ పోవడం దుర్మార్గమన్నారు.

ఈ నిరసన ర్యాలీలో సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, బీఓసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు మధు, సైదులు ముదిరాజ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో సిపిఐ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ

❖ వైద్యాధికారి డాక్టర్ సునీల్
❖ మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం
❖ డెంగ్యూ నిర్మూలనపై వైద్య సిబ్బంది, ప్రజల చేత ప్రతిజ్ఞ
❖ ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని పిలుపు




**దశ, మణుగూరు:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ చర్యలు పాటించడం ద్వారానే ప్రాణాంతక డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ నివారణపై వైద్య సిబ్బంది, రోగులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే దోమలు నిల్వ నీటిలోనే పెరుగుతాయని, కాబట్టి ఇళ్ల పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇళ్లలోని నీటి తొట్లు, డ్రమ్ములు, కూలర్లు, ఇతర నీటి పాత్రలను వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేసి ఎండబెట్టాలని సూచించారు. నిల్వ నీటి వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూతో పాటు మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి శుక్రవారం తమ ఇళ్లలో "డ్రై డే" కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, నివారణ చర్యలపై గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వీరస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ డి. పరంగిణి, పీహెచ్ఎన్ సత్యమ్మ, సూపర్‌వైజర్లు జానకి, స్వరూప రాణి, అనసూయ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు రోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.